కేయూ వీసీపై విజిలెన్స్ విచారణకు ఆదేశం

హైదరాబాద్/వరంగల్, మే 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేశ్‌పై విజిలెన్స్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వైస్ చాన్సలర్‌గా రమేశ్ తీసుకున్న నిర్ణయాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట)లోని కొందరు ప్రతినిధులు శుక్రవారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశానికి ఫిర్యాదు చేశారు. కాకతీయ యూనివర్సిటీలో 12 ఎకరాలు కబ్జా అయిందని, మెస్ బిల్లుల పేరుతో రూ.2.50 కోట్ల అక్రమాలు జరిగాయని, ఆరోపణలతో తొలగించిన వారిని ఫ్యాకల్టీగా మళ్లీ నియమించారని, బదిలీలో అక్రమాలు, నకిలీ ప్రాజెక్టుల పేరిట నిధుల ఖర్చు వంటి అంశాలను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులోని అంశాలపై విచారణ నిర్వహించాలని బుర్రా వెంకటేశం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు శనివారం ఆదేశాలు ఇచ్చారు. తాటికొండ రమేశ్ పదవీకాలం ఈ నెల 21న ముగుస్తున్నది. కాకతీయ యూనివర్సిటీ వీసీపై విజిలెన్స్ విచారణ జరగడం ఇదే మొదటిసారి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో పలు యూనివర్సిటీలకు కొత్తగా వీసీలను నియమించేందుకు ప్రభుత్వం సెర్చ్ కమిటీలు నియమించింది. కానీ కాకతీయ యూనివర్సిటీకి సెర్చ్ కమిటీని నియమించలేదు. కేయూకు కొత్త వీసీ నియామకం వాయిదా వేసేందుకే ఇలా చేసిందని సమాచారం.

విచారణకు స్వాగతం : కేయూ వీసీ

హనుమకొండ చౌరస్తా, మే 18 : కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌గా తనపై తెలంగాణ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ ఎంక్వైరీని ఆహ్వానిస్తున్నానని వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను కేయూ వీసీగా 3 సంవత్సరాల పదవీ కాలంలో ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. యూనివర్సిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానని, ఆ ఫలితమే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించినట్టు, జాతీయస్థాయిలో యూనివర్సిటీ హోదా, ప్రతిష్ఠను మరింతగా పెంచినట్టు పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను నిర్వహించామని, మూడేండ్లలో యూనివర్సిటీ సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన అన్ని రకాల సదుపాయాలు, బెనిఫిట్స్, బకాయిలు అందించినట్టు పేర్కొన్నారు. యూనివర్సిటీ చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వ సహకారంతో 507 మంది దినసరి, తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు 3 నుంచి 4 రెట్లు పెంచామని చెప్పారు. గతంలో పీహెచ్‌డీ అడ్మిషన్లపై కొందరు తీవ్ర ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం విచారణ కమిటీని నియమించిందని, ఆ కమిటీ అడ్మిషన్లు పూర్తి పారదర్శకంగా జరిగిందని తెలిపిందని చెప్పారు. తన హయాంలో ఒక్క పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదని, యూనివర్సిటీ భూమి ఒక్క గుంట కూడా అన్యాక్రాంతం కాకుండా కాపాడినట్టు పేర్కొన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిని ఓర్వలేక దొడ్డిదారిలో ప్రమోషన్ల పొందాలనుకునే వ్యక్తులు, అక్రమ అడ్మిషన్లు కావాలని గగ్గోలు పెట్టే వ్యక్తులు చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం విజిలెన్స్ కమిటీ వేయడాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నట్లు కేయూ వీసీ రమేశ్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో యాజమాన్య కోటా సీట్ల భర్తీ!

- తెలంగాణ, ఏపీకి ఈ సారి ఉమ్మడి అడ్మిషన్లే..
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్లను ఆన్‌లైన్ విధానంలో భర్తీచేసే ప్రతిపాదనలు ఉన్నాయని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. శనివారం జేఎన్టీయూ కూకట్‌పల్లిలో ఎప్‌సెట్-2024 ఫలితాల విడుదల సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. యాజమాన్య కోటాలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుకే అధిక డిమాండ్ ఉన్నదని తెలిపారు. కోర్ గ్రూపులైన సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తిచూపడం లేదని చెప్పారు. ఇంజినీరింగ్ కోర్ గ్రూపులో సీట్లు బాగానే మిగిలుతున్నాయని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఎమర్జింగ్ కోర్సులు ఉన్నాయని, వాటిలో కూడా విద్యార్థులు ప్రవేశాలు పొందాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు వర్సిటీలకు అనుమతి ఇవ్వడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తూ, నాణ్యమైన విద్యను అందించడానికి ముందుకొచ్చే ప్రైవేటు యూనివర్సిటీలకే ఏర్పాటుకు అనుమతిస్తామని తెలిపారు. ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు కోసం కొందరు ముందుకొస్తున్నారని, వారిని పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, అగ్రి, ఫార్మా కళాశాలల్లో తెలంగాణ, ఏపీ విద్యార్థులకు ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి అడ్మిషన్లే నిర్వహిస్తామని వెంకటేశం తెలిపారు. జూన్ 2వతేదీ లోపే ఎప్‌సెట్ ఫలితాలు విడుదలైనందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

బరాజ్‌లపై మళ్లీ అధ్యయనం!

- సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌తో చేయించాలని నిర్ణయం
- ఇరిగేషన్ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- కాళేశ్వరం బరాజ్‌లను పరిశీలించాలని ఆదేశాలు

హైదరాబాద్, మే18 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లోని లోపాలపై సీడబ్ల్యూపీఆర్‌ఎస్ ద్వారా అధ్యయనం చేయించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించిందని సమాచారం. ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్టు తెలుస్తున్నది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) మధ్యంతర నివేదిక ప్రకారం తదుపరి చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సమీక్షించారు. సచివాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, ఈఎన్సీలతో శనివారం సీఎం భేటీ అయ్యారు. ఎన్డీఏస్ఏ మధ్యంతర నివేదికపై చర్చించారు. ఎన్‌డీఎస్ఏ కమిటీ సిఫారసు మేరకు సీడబ్ల్యూపీఆర్ఎస్‌తో 3 బరాజ్‌లను అధ్యయనం చేయించాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. తొలుత అన్నారం బరాజ్‌ను అధ్యయనం చేయించాలని అధికారులు సీఎం, మంత్రులకు వివరించినట్టు సమాచారం. ఆ దిశగా చర్యలు చేపట్టాలని, సీడబ్ల్యూపీఆర్ఎస్‌ను సంప్రదించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేశారని అధికారవర్గాలు వెల్లడించాయి. మరో నెల రోజుల్లో వానకాలం ప్రారంభంలోగా తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక రిపేర్లు చేయాలా..? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా..? ఇరిగేషన్ విభాగం అధికారులతో కలిసి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, త్వరలోనే మేడిగడ్డ, సుందిళ్ల, అక్కడి పంప్ హౌస్‌లను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

ఎప్‌సెట్‌లో అమ్మాయిలదే హవా

ఇంజినీరింగ్‌లో 5.36 % తగ్గిన ఉత్తీర్ణత

- అగ్రికల్చర్, ఫార్మసీలో 3.35 % వృద్ధి
- టాప్ టెన్ ర్యాంకుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు చెరి సగం.. త్వరలోనే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం
- ఎప్‌సెట్-2024 ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వెంకటేశం



ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం. పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ప్రొఫెసర్ ఎస్‌కే మహ్మద్, సెక్రెటరీ ప్రొఫెసర్ శ్రీరామ్‌వెంకటేశ్, జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి, కన్వీనర్ డీన్‌కుమార్.

ఇంజినీరింగ్ విభాగంలో..
క్యాటగిరీవారీగా తెలంగాణ, ఏపీ అర్హత వివరాలు..

క్యాటగిరి	నమోదు	హాజరు	అర్హత
బీసీఏ	20,292	19,192	12,436
బీసీబీ	50,458	48,382	33,715
బీసీసీ	1,350	1,248	0,874
బీసీడీ	51,205	48,757	32,818
బీసీఈ	13,731	13,160	8,337
ఓసీ	75,329	70,021	52,386
ఎస్సీ	27,447	25,730	25,730
ఎస్టీ	14,938	14,128	14,128
మొత్తం	2,54,750	2,40,618	1,80,424

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం ఈ నెల 7 నుంచి 11 వరకు నిర్వహించిన ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో అమ్మాయిలు అత్యధిక ఉత్తీర్ణత సాధించి టాప్‌లో నిలిచారు. ఫలితాల నీడీ, పాస్ వార్డును రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రితో కలిసి శనివారం విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో బాలుర కంటే బాలికలే అధికంగా ఉత్తీర్ణత సాధించారు. బాలురు 74.38 %, బాలికలు 75.85% క్వాలిఫై అయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీలో కూడా బాలురు 88.25%, బాలికలు 90.18 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 2,54,750 మంది ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,40,618 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 1,80,424 మంది (74.98%) అర్హత పొందారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 1,00,432 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 91,633 మంది హాజరయ్యారు. వీరిలో 82,163 మంది (89.66%) ఉత్తీర్ణులయ్యారు. కాగా, ఇంజినీరింగ్ విభాగంలో గతేడాదితో పోల్చితే ఈ సారి దరఖాస్తులు సంఖ్య పెరిగినప్పటికీ.. ఫలితాలు బాగా తగ్గాయి. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పెరిగాయి.

టాప్ టెన్ ర్యాంకుల్లో సగం ఏపీ వాళ్లకే

ఎప్‌సెట్ టాప్ టెన్ ర్యాంకుల్లో సగం వరకు ఏపీ విద్యార్థులే దక్కించుకున్నారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలోనూ టాప్ టెన్ ర్యాంకుల్లో ఐదు ర్యాంకులు పొందారు. ఇంజినీరింగ్‌లో 1, 2, 5, 6, 10 ర్యాంకులు, అగ్రి, ఫార్మా విభాగంలో 1, 2, 4, 7, 10 ర్యాంకులు కూడా ఏపీ విద్యార్థులకే దక్కడం గమనార్హం.

త్వరలోనే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం: ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

ఎప్‌సెట్ ఫలితాలు విడుదలైనందున ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీకి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి చెప్పారు. అందుకోసం త్వరలోనే అడ్మిషన్ల కమిటీ సమావేశం కానున్నట్టు తెలిపారు. ఇంజినీరింగ్‌లో ఈ సారి పుష్కలంగా సీట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులెవ్వరూ సీట్లు రాలేదన్న ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. శ్రీనిధి, గురునానక్ ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్సిటీ హోదా లేకపోయినా అడ్మిషన్లు నిర్వహించిన అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నదని చెప్పారు. అక్కడ అడ్మిషన్లు పొందిన విద్యార్థులను ఓయూ, జేఎన్టీయూకు చెందిన కాలేజీలలో సర్దుబాటు చేశామని చెప్పారు. ఆ రెండు కాలేజీలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

ఎప్‌సెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు

ఇంజినీరింగ్ విభాగంలో ర్యాంకులు..

1 మొదటి ర్యాంకు	–	ఎస్ జ్యోతిరాదిత్య (ఏపీ-శ్రీకాకుళం)
2 రెండో ర్యాంకు	–	హర్ష (ఏపీ-కర్నూలు)
3 మూడో ర్యాంకు	–	రిషి శేఖర్‌శుక్లా (తెలంగాణ, సికింద్రాబాద్)
4 నాలుగో ర్యాంకు	–	సందేశ్ (తెలంగాణ, హైదరాబాద్)
5, ఐదో ర్యాంకు	–	సాయి యశ్వంత్‌రెడ్డి (ఏపీ-కర్నూలు)
6 ఆరో ర్యాంకు	–	పుట్టి కుశల్‌కుమార్ (ఏపీ-అనంతపురం)
7 ఏడో ర్యాంకు	–	హుండికర్ విదీత్ (తెలంగాణ- హైదరాబాద్)
8 ఎనిమిదో ర్యాంకు	–	రోహన్ (తెలంగాణ-హైదరాబాద్)
9 తొమ్మిదో ర్యాంకు	–	కొంతేమ మణితేజ (తెలంగాణ-వరంగల్)
10 పదో ర్యాంకు	–	ధనుకొండ శ్రీనిధి (ఏపీ-విజయనగరం)

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ర్యాంకులు..

1 మొదటి ర్యాంకు	–	ప్రణీత (ఏపీ-మదనపల్లె)
2 రెండో ర్యాంకు	–	రాధాకృష్ణ (ఏపీ-విజయనగరం)
3 మూడో ర్యాంకు	–	శ్రీవర్షిణి (తెలంగాణ-హనుమకొండ)
4 నాలుగో ర్యాంకు	–	సాకేత్ రాఘవ్ (ఏపీ-చిత్తూరు)
5 ఐదో ర్యాంకు	–	సాయి వివేక్ (తెలంగాణ-ఆసిఫ్‌నగర్)
6 ఆరో ర్యాంకు	–	మహమ్మద్ అజాన్‌సాద్ (తెలంగాణ-నాచారం)
7 ఏడో ర్యాంకు	–	వడ్లపూడి ముఖేశ్ చౌదరి (ఏపీ-తిరుపతి)
8 ఎనిమిదో ర్యాంకు	–	భార్గవ్ సుమంత్ (తెలంగాణ-హైదరాబాద్)
9 తొమ్మిదో ర్యాంకు	–	జయశెట్టి ఆదిత్య (తెలంగాణ-అల్విన్‌కాలనీ)
10 పదో ర్యాంకు	–	దివ్యతేజ (ఏపీ- శ్రీసత్యసాయి జిల్లా)

2024లో ఇంజినీరింగ్, అగ్రి, ఫార్మసీ ఫలితాల వివరాలు..

అంశం	ఇంజినీరిగ్ విభాగం	అగ్రి, ఫార్మా..
పరీక్షలకు హాజరు	2,40,618	91,633
అర్హులు	1,80,424	82,163
ఉత్తీర్ణత శాతం	74.98 %	89.66 %

2023లో ఇంజినీరింగ్, అగ్రి, ఫార్మసీ ఫలితాల వివరాలు..

అంశం	ఇంజినీరిగ్ విభాగం	అగ్రి, ఫార్మా..
పరీక్షలకు హాజరు	1,95,275	1,06,514
అర్హులు	1,56,879	91,935
ఉత్తీర్ణత శాతం	80.33 %	86.31%

అగ్రి, ఫార్మాలో. క్యాటగిరీలవారీగా తెలంగాణ, ఏపీ కలిపి అర్హత సాధించిన వారు

క్యాటగిరి	నమోదు	హాజరు	అర్హత
బీసీఏ	7451	6789	5449
బీసీబీ	14258	13140	10,989
బీసీసీ	828	731	643
బీసీడీ	16,666	15,336	12,149
బీసీఈ	11,520	10,762	9,179
ఓసీ	12,450	11,173	10,052
ఎస్సీ	24,239	21,927	21,927
ఎస్టీ	13,020	11,775	11,775
మొత్తం	1,00,432	91,633	82,163

నిధులు లేక నిమ్మలం!

- ఓఅండ్ఎం పనులకు నిధులెక్కడ?
- నత్తనడకన ప్రాజెక్టు మరమ్మతులు

2023-24 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన మొత్తం పనులు 1254
ఇప్పటికీ ప్రారంభం కాని పనులు 353 (28.14శాతం)
పురోగతిలో ఉన్నవి 505 (40.27శాతం)
పూర్తయిన పనులు 396 (31.57శాతం)
కేటాయించిన మొత్తం నిధులు రూ. 305.42 కోట్లు
ఇప్పటివరకు బీఆర్‌వో ఇచ్చింది రూ. 174 కోట్లు
విడుదల చేసింది రూ. 12 కోట్లు

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు సాగునీటి ప్రాజెక్టులు, ఆనకట్టలు, కాలువలకు చేపట్టిన మరమ్మతులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వానకాలం సమీపిస్తున్నా ఇప్పటికీ చాలాచోట్ల పనులు చేపట్టలేదు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులపై ప్రభుత్వానికి ప్రణాళికనేది లేకుండా పోయింది. కాలువలు, తూములు, పంప్‌హౌజ్‌లు, ప్రాజెక్టుల గేట్లు తదితర మరమ్మతుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓఅండ్ఎం విభాగాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఏఈ నుంచి సీఈల వరకు ఆర్థిక అధికారాలను బదలాయించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు రూ.305.42కోట్ల అంచనా వ్యయంతో 1254 పనులకు ఓఅండ్ఎం కమిటీ ఆమోదం తెలిపింది. ఇప్పటి వరకు 31.57 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ప్రభుత్వం ఆశించిన మేర నిధులు విడుదల చేయకపోవడంతో మరమ్మతులు మందకొడిగా సాగుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు చెప్తున్నారు.

మిగిలింది రెండు నెలలే

ఓఅండ్ఎం పనులను సాధారణంగా వేసవిలోనే చేస్తారు. వర్షాకాలంలో నిత్యం వానలు, బురదవల్ల ప్రాజెక్టు పనులకు అడ్డంకి ఏర్పడుతుంది. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉంటాయి కాబట్టి శీతాకాలంలోనూ పనులకు ముందుకు సాగవు. దీనికితోడు తైబందీ నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది కాబట్టి పనుల నిర్వహణ కష్టమే. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆమోదం తెలిపిన 1254 పనుల్లో ఇప్పటి వరకు 396 పనులు మాత్రమే పూర్తయ్యాయి. మరో 359 పనులు పురోగతిలో ఉన్నాయి. 500 పనులు అసలు మొదలే కాలేదు. అగ్రిమెంట్ స్టేజ్‌లో 146, టెండర్ దశ లో 212 ఉండగా, 141 పనులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. ఇలానే సాగితే జూన్ నాటికి పూర్తికావడం కష్టమే.

మరమ్మతులపై సర్కారు శీతకన్ను

నిరుడు భారీ వరదలకు వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో పదుల సంఖ్యలో చెరువులు తెగిపోతే తాత్కాలిక మరమ్మతులు చేసి శాశ్వత మరమ్మతులకు అనుమతులు ఇచ్చారు. అందుకు సంబంధించిన పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కరత్వాడ సమీపంలోని రాముని చెరువు పునరుద్ధరణకు ప్రభుత్వం రూ. 61.40లక్షలు మంజూరు చేసింది. టెండర్లు ఎప్పుడో పూర్తయినా వారం క్రితమే మట్టితీత పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు ప్రధాన పనులే ప్రారంభం కాలేదు. కాకతీయ కెనాల్ డిస్ట్రిబ్యూటరీలపై క్రాస్ రెగ్యులేటర్లు/ఓటీల మరమ్మతులకు రూ. 1.84 కోట్లు మంజూరు చేయగా ఆ పనుల్లోనూ తీవ్ర జాప్యం నెలకొన్నది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకులపల్లి 77.658 కిలోమీటర్ వద్ద 21వ మేజర్ ఆఫ్ టేక్ స్లూయిస్, లక్నవరం చెరువు 3 చానళ్లతోపాటు, స్వర్ణ, సుద్దవాగు, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో వజీరాబాద్ డిస్ట్రిబ్యూటరీ, కాకతీయ కెనాల్ నుంచి కేసముద్రానికి సాగునీటిని అందించే డీబీఎం 48, రాజోలిబండ డైవర్షన్ స్కీంలలోని పనులు మరమ్మతుల్లో జాప్యానికి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

ఎమర్జెన్సీ పనులూ అంతే

ప్రాజెక్టుల్లో వెంటనే చేపట్టాల్సిన అత్యవసర పనుల విషయంలోనూ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. అందుకు కడెం ప్రాజెక్టు ప్రత్యక్ష ఉదాహరణ. నిరుడు ప్రాజెక్టుకు దాదాపు 5 లక్షల క్యూసెక్కులకుపైగా వరద రావడంతో స్పిల్‌వేలో 11వ నెంబర్ గేటు దెబ్బతిన్నది. డివైడింగ్ వాల్‌తోపాటు, ఆప్రాన్ పోర్షన్ కూడా కొన్ని చోట్ల ధ్వంసమైంది. రూ. 1.44 కోట్లతో అంచనాలు రూపొందించారు. ప్రాజెక్టు ఎలక్ట్రిఫికేషన్ తదితర పనులకు మరో రూ.5 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఆ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన క్రెస్ట్‌గేట్ల పనులు, ఎస్సారెస్పీ గేట్ల రోప్స్‌ను మార్చడం, జూరాల ప్రాజెక్టు మరమ్మతులు కూడా నత్తనడకనే కొనసాగుతున్నాయి.

బిల్లులు చెల్లిస్తేనే కదలిక

ఓఅండ్ఎం పనులను సాధారణంగా చిన్న గుత్తేదారులు నిర్వహిస్తుంటారు. కాంపోనెంట్ల వారీగా మరమ్మతులు పూర్తిచేసిన కొద్దీ అందుకు సంబంధించిన బిల్లులు చెల్లిస్తేనే తదుపరి పనులు ముందుకు కదులుతాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమే పనులు మందకొడిగా కొనసాగడానికి ప్రధాన కారణమని ఇటు క్షేత్రస్థాయి ఇంజినీర్లు, అటు గుత్తేదార్లు చెప్తున్నారు. ప్రస్తుతం రూ. 24కోట్ల మేర పనులు మాత్రమే పూర్తయ్యాయి. రూ.152 కోట్లతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన పనులను చేపట్టేందుకు 106.54కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

పనుల ఆమోదానికి జంకుతున్న సిబ్బంది

ఒకవైపు నిధుల లేమీ, మరోవైపు ఆయా పనులను ఆమోదించి చేపట్టేందుకు ఇంజినీర్ అధికారులు జంకుతున్నారు. ప్రాజెక్టుల మరమ్మతులు, మెయింటెనెన్స్ పనుల్లో జాప్యం నెలకొనవద్దనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓఅండ్ ఎం విభాగాన్ని ఏర్పాటు చేసింది. రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చీఫ్ ఇంజినీర్ల స్థాయిలోనే ఓఅండ్ఎం కమిటీ సమావేశాన్ని నిర్వహించుకుని పనులను ఆమోదించుకుని, చేపట్టుకునే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం 19 టెరిటోరియల్ సర్కిళ్లలో చాలా మంది సీఈలు అసలు సమావేశాలే నిర్వహించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. క్షేత్రస్థాయిలోని ఏఈఈ, జేఈఈలను ప్రభుత్వం చాలా చోట్ల గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించడంతో కొనసాగుతున్న పనులపైనా పర్యవేక్షణ కొరవడింది.

‘నారాయణ’కు 100 లోపు 50 ర్యాంకులు

నారాయణ విద్యాసంస్థలు

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): టీజీ ఎప్‌సెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు వందలోపు 50 ర్యాంకులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పీ సింధూర నారాయణ, పీ శరణి నారాయణ తెలిపారు. 4, 5, 7, 8, 12 వంటి అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో వందలోపు 34 ర్యాంకులు, అగ్రి, ఫార్మసీ విభాగంలో వందలోపు 16 ర్యాంకులు సాధించినట్టు వివరించారు. మొత్తం పదిలోపు 4, వందలోపు 50, 500లోపు 234, వెయ్యిలోపు 454 ర్యాంకులు సాధించారని తెలిపారు. 45 సంవత్సరాలుగా విశిష్ట ప్రణాళిక ద్వారా ఇంతటి ఘన విజయాలు సాధిస్తున్నామని వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందనలు తెలిపారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్ విద్యార్థుల జయభేరి

కమాన్‌చౌరస్తా, మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ఘనవిజయం సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి చెప్పారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన వీ హాసిని 114, ఎన్ హేమంత్ 157, జీ శ్రీహాస్ 166, కే సుప్రియ 296, ఎన్ జ్ఞానద 480, వీ శ్రీముఖి 568, ఎం వర్షిత్ 575, జీ సాయిమంజునాథ్‌రెడ్డి 610, పీ జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీ వెన్నెల 876, తేజస్విని 942, ఏ శివవరుణ్ 973, సీహెచ్ అనూహ్య 950, పీ శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారని తెలిపారు. 1,000 లోపు 16 ర్యాంకులు, 2,000లోపు 39 ర్యాంకులు, 3,000లోపు 63 ర్యాంకులు, 5,000లోపు 116 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని వివరించారు.

ఎప్‌సెట్‌లో శ్రీవర్షిణికి మూడోర్యాంకు

శ్రీవర్షిణి

హనుమకొండ చౌరస్తా, మే 18: తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన విద్యార్థిని గడ్డం శ్రీవర్షిణి అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది.అగ్రికల్చర్, ఫార్మసీ క్యాటగిరీలో శ్రీవర్షిణి 145.26 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడవ ర్యా